

# అజ్ఞాత సహాయం

ఇసుకపల్లి లక్ష్మీనరసింహాశాస్త్రి

*ఊరక ఎవరూ ఎవరికీ ఏమీ ఇవ్వారు, ఈ ప్రపంచంలో. అందులోనూ అయాచితంగా డబ్బు ఇచ్చారంటే అనుమాన హేతువు కాక మరేమౌతుంది?*


---

**ఆవురుమంది,** 'అమ్మా' అంటూ మాల, అద్దుకుంటూంది కంట తడి పమిట కొంగుతో. కూతుర్ని బ్రతిమాలుతూంది పార్వతి, 'ఏదీ నా వంక చూడు. నాతో చెప్పు' అంటూ. అమాయకంగా తల్లి మొహంలోకి చూస్తూ, 'నాకేం తెలీదే అమ్మా. నిజంగా నాకేం తెలీదే' అన్నది మాల.

ఎప్పుడూ యింత మంకుపట్టు పట్టలేదు అమ్మాయి. ఇహ చెప్పదు. నిజం చెప్పదు. మనస్సును సమాధానపరుచుకుని మెదలకుండా ఊరుకుంది. అబ్బ! ఎంతదానివయినావే అన్నట్టు, కూతురి మొహంలోకి ఒక్కసారిగా తీవ్రంగా చూసింది.

బిక్కమొహం వేసుకుని కూర్చుంది. ఇంత గట్టిగా అమ్మ తన్ను ఏ విషయమూ అడగలేదు. ఏ మాట చెప్పినా యిట్టే నమ్మేది. రెండో ప్రశ్న వేసేదే కాదు. ఈసారి ఏమిటో ఆశ్చర్యంగా ఉంది. ఎంత బ్రతిమాలుకున్నా నమ్మటంలేదు. అంత అపనమ్మకం తనమీద ఎందుకు ఏర్పడిందో అర్థం కావటంలేదు. మాల తీవ్రంగా వ్యథ పడుతూంది.

ఇద్దరూ ఎడమొహం పెడమొహంగా ఉండిపోయారు. తల్లిని చూడటానికి భయంవేసి ఊరుకుంది మాల. కూతుర్ని చూడటానికి అసహ్యంవేసి ఊరుకుంది పార్వతి.



కైలాసనాథస్వామి ఆలయం (కంచి) ఫోటో—ఆర్. సుబ్రమణ్యం (తిమ్మవరెడ్ల)

చివాలున యిట్టే లేచి వాకిట్లోకి వెళ్ళబోయింది పార్వతి.

అప్పుడే లోపలికి వస్తున్న కోటయ్య, ఎక్కడి కన్నట్టు చేతి కర్రను గట్టిగా భూమిమీద కొట్టాడు. ఆమె తలెత్తి చూసింది. మరుక్షణంలోనే తల వంచుకుని, చర చర వాకిట్లోకి నడిచింది. వెనక్కు తిరిగి ఆమెను చూస్తూ తల ఊపాడు.

'అమ్మాయీ, ఏం చేస్తున్నావ్!'

'వస్తున్నా, తాతయ్యా!' ఎదురుగా వచ్చి నిలబడింది మాల.

'ఇదిగో, నా వంక చూడు. పెద్దవాణ్ణి చెపుతున్నా. అదుగో, కళ్ళు ఎర్రగా ఉన్నాయి. ఎందుకొస్తాయి కంట్లోకి నీళ్ళు ఊరికేను? నీకు ఎన్నో తడవలు చెప్పా. కూర్చో. అమ్మ ఏమన్నా అంటుందనేగా ? పిచ్చి పిల్లా! నిన్ను కోప్పడితే నే లేనూ? నాతో చెప్పు. నీ కోరిక ప్రకారమే చేయిస్తా. అమ్మను ఒప్పిస్తా. ఆ బాధ్యత నాది. తెలిసిందా? ఈ ముసలి తాత అబద్ధాలు ఆడతా డనుకొన్నావా? చెయ్యి తియ్యి. మొహం మీద చెయ్యి తియ్యి.'

'అంతా అయోమయంగా వుంది. నా కేమీ అర్థం కావటంలేదు. నా కేమీ తెలీదు. నామాట నువ్వేనా నమ్మవా?'

'అదుగో. మళ్ళీ అదే ముక్క?' గట్టిగా చేతి కర్రను గచ్చుమీద కొట్టాడు.

'తెలీకపోతే ఏం చెయ్యమంటావ్? తెలియని చెప్పమంటావా?' చనువుగా ప్రశ్నించింది మాల.

'తెలీదని అనగానే సరిపోతుం దనుకొన్నావా?' మొహం పైకెత్తి చూశాడు.

'నీమీద ఒట్టు, తాతా. అబద్ధాలు ఆడటం లేదు.' గంభీరంగా అన్నది. పొర్లుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకోవటానికి, పమిటకొంగు మొహానికి అడ్డం పెట్టుకుంది.

కలవరపడ్డాడు కోటయ్య.

'ఆ!' అన్నాడు అమాంతం.

బిత్తరపోతూ చూసింది మాల కూడా.

ఆయన మనస్సు ఎటో పోయింది.

వాకిట్నించి వస్తున్న పార్వతిని చూసి, రెండడుగులు ముందుకువేసి, 'పాపం! అమ్మాయికేం తెలీదు' అన్నాడు నిశ్చయంగా.

'అవును. అమ్మాయికీ తెలీదు, నీకూ తెలీదు, నాకూ తెలీదు! మరెట్లా వచ్చింది? శ్రీనివాస్ ఎవరు?' గభాలున ప్రశ్నించింది.

'ఏ ఊరని వుంది?'

'శ్రీనివాస్, మైలాపూర్, మద్రాసు

'అంతేనా!'

'అంతే!'

'ఆశ్చర్యంగానే వుంది! మన ముగ్గురికీ తెలియకుండా ఈ మనిఆర్డరు ఎట్లా వచ్చినట్టు? అమ్మాయి పేరట ఎందుకు పంపించినట్టు? మాలేమో ఏమీ తెలీదంటుంది. దీంట్లో ఏదో అంతరార్థం వుండితీరాలి!' ఆలోచనలో పడిపోయాడు కోటయ్య.

'నా కేమో కాదు. ఏదైనా నెత్తిమీది కొచ్చిపడిన తర్వాత, ఆకులు పట్టుకునే బదులు, ముందుగానే జాగ్రత్తపడితే మంచిదని. వేలకు వేలు డబ్బు కుమ్మరించి అల్లుణ్ణి వెతుక్కురాబోయినామా, పెట్టామా! దానంతటది, వచ్చినవాణ్ణి చేసుకుంటానంటే మన అభ్యంతరం ఏముంటుంది? తన మంచికి చెప్పినా తెలుసుకోలేకపోయె!' మెల్లిగా అన్నది కోటయ్యతో.

'బుజ్జగించి అడిగి చూశాను. ఏమీ తెలీదంటుందే?'

'ఏదో పెద్దమ్మవారు ఆవహించినట్టుంది! ఇప్పు డెన్ని చెప్పినా లాభంలేదు. దానికే బుద్ధి పుట్టి రావాలి. అంతవరకూ మనం ఓపిక పట్టుకుని కూర్చోవాలి!' నిస్పృహగా కోటయ్యవంక చూసింది పార్వతి.

చీటికీ మాటికీ దెప్పిపొడవటం, తల్లిదగ్గర చనువు తీసుకుని మాట్లాడలేకపోవటం, ఇద్దరి మనస్సులూ విడివిడిగా ఆలోచించటం భరింపరాని బాధగా తయారయింది. అమ్మంటే తనకు ఎంతో ప్రేమ, పంచ ప్రాణాలూను. చీమ చిటుక్కుమన్నా, తల్లితో చెప్పి తీరవలసిందే. అలాంటి అమ్మే, తనను అపార్థం చేసుకుని, తనమీద అపనిందవేస్తే, ఇంకా ఎవరిదగ్గరకు వెళ్ళి చెప్పుకుంటుంది? ఎవరు నమ్ముతారు?

ఈ బాధ భరించరానిదయిపోయింది. ఒకటే దిగులు. మాల తపన పడిపోతూంది.

తన ఊహాకు అనుగుణంగా పరిస్థితులను చిత్రించుకుంటూ పార్వతి, కూతుర్ని గురించి దిగులుపడిపోతూంది.

మాల అయితే తీవ్రంగా ఆలోచించటం మొదలుపెట్టింది. ఈ సంఘర్షణనుంచి ఎట్లాగైనా బయటపడాలి. ఈవిధంగా కొంపలో ఒక్క క్షణం కూడా ఉండలేదు. ఏమైనా గాని, అమ్మకు నచ్చేటట్లు చెప్పాలి. అమ్మను నమ్మించాలి. అబద్ధం చెప్పయినాసరే అమ్మ మనస్సుకు నచ్చే సమాధానం చెప్పాలని నిశ్చయించుకుంది మాల.

మరేమని చెప్పాలి? మళ్ళీ ఆలోచన. కట్టు కథ కట్టాలి.

శ్రీనివాస్‌తో తనకు పరిచయం ఉందని, అతన్ని తాను ప్రేమించానని, లేకపోతే అతనే తనను ప్రేమించాడని, ఇద్దరూ పెళ్ళి చేసుకోవటానికి ఒప్పుకున్నామని. ఇంతవరకు బాగానే ఉంది. తర్వాత? ఈ విషయం ఇద్దరికీ కూడా బాహాటంగా చెప్పే ధైర్యం లేక ఒక ఉపాయం ఆలోచించామని. అదే ఈ ఉపాయం! తాను మద్రాసు వెళ్ళి మనిఆర్డరు చేస్తాడు. అప్పుడే అమ్మ అడుగుతుంది గదా, ఎవరు పంపించారు ఏమిటని, చెప్పెయ్యవచ్చు. అతికిపోయింది. అమ్మ తన మాట నమ్ముతుంది. తర్వాత? ఏ మాలోచించాలో తెలీక మానేసింది. బరువుగా లేచింది. ఎప్పటి కప్పుడు ఆలోచించి సమాధానం చెప్పెయ్యటం. అంతకంటె చేసే దేమీ లేదనుకుంది.

ధైర్యంగా తల్లి దగ్గరకు వచ్చి నిలబడింది.

'అమ్మా!' అన్నది బింకంగా.

'పోస్ట్‌మన్' అంటూ ఒక కవరు గిరాటు పెట్టిపోయాడు.

పార్వతి కళ్ళు రెండూ ఆ కవరుమీద అప్రయత్నంగా పడ్డాయి. చేతిలోకి తీసుకుంది. గబగబ చించి చూస్తూంది.

ఆదుర్దాగానూ, గాభరాగానూ ఉంది. కళ్ళు చెదిరినాయి. ఒళ్ళు జలదరించింది. ఓసారి పైనుంచి చివరిదాకా చూసింది. అక్షరాలు మసక మసకగా కనిపించినాయి. ఒళ్ళు ఝుల్లుమన్నది. దభాలున కూర్చుంది. కళ్ళు నిలిపేసి చదువుతూంది.

'....నిన్ను చూసి చాలా రోజులయింది. గడించిన రోజుల్ని జ్ఞాపకం తెచ్చుకుని బాధపడటం కంటె ఇప్పుడు మిగిలిం దేమీ లేదు. నీ జీవితం నాశనం చేశాను. ఇప్పుడు ఏమనుకున్నా ప్రయోజనం లేదు. నా ఆత్మ, అమ్మాయిలో ప్రతిబింబిస్తూ ఎప్పుడూ నీ దగ్గరే తిరుగుతూంది. మాల పెద్దదయింది. ఎట్లా ఉందో ఒక్కసారి చూడాలని ఉంది. నేను మీ దగ్గరికి పైవారంలో వస్తున్నాను. ఎవ్వరికీ తెలియకుండా ఒక్కసారి మనసారా చూసిపోతాను. అంతే. మనస్సు ఆగక శ్రీనివాస్ అనే మారు పేరుతో అమ్మాయి పేరన మనిఆర్డరు చేశా. కలవరపడక!.....'

పెద్దగా రొప్పుతూ ఆయాస పడుతూంది, పార్వతి.

'అమ్మా! ఏమిటే ఉత్తరం? ఎవరు రాశారే? చెప్పవే, అమ్మా.' బిగ్గరగా కేకపెట్టింది మాల. ★